క్లుప్తంగా

ఎట్టకేలకు సిమెంట్ స్తంభాల ఏర్పాటు



తుంగమడుగులలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

అడ్డతీగల: వేలాడుతున్న విద్యుత్ లైన్లకు కర్రలను ఊతంగా పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్న తుంగమడుగులలో స్థానికుల ఇబ్బందులపై జనవరి 30 న 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం సిమెంట్ స్తంభాలను ఏర్పాటుచేశారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు



ఏపీవో అప్పలరాజు

కొయ్యూరు: ఆర్‌వో ఎఫ్ఆర్ పట్టాలు కలిగిన వారికి 150 రోజుల పనిదినాలు కల్పిస్తామని ఏపీవో టి.అప్పలరాజు తెలిపారు. వారంతా ఉపాధి కార్యాలయానికి వచ్చి వివరాలు అందజేయాలని కోరారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాదారులకు 150 రోజుల పనిని కల్పిస్తామన్నారు. 18 సంవత్సరాలు దాటిన వారంతా జాబ్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసిన కొద్ది రోజుల్లో కార్డులు వస్తాయన్నారు. జాబ్‌కార్డుదారులకు వెంటనే పనికి కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. విధుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం తగదన్నారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు.

220 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ హేమంత్

చింతూరు: మండల కేంద్రంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 220 మందికి వైద్య పరీక్షలు చేశారు. భద్రాచలంకు చెందిన నేతాజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో రోగులకు ఆర్థోపెడిక్ పరీక్షలు చేసి, ఈసీజీ, సుగర్ తదితర పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు డాక్టర్ హేమంత్ , డాక్టర్ రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ఆస్పత్రి యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. నిర్వాహకులు జక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మందుల కిట్లు



మందుల కిట్లు బాక్సులు

రాజవొమ్మంగి: మండలంలోని 101 అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కోటి చొప్పున మందుల కిట్లు వచ్చాయని, వాటిని త్వరలో అందజేస్తామని సీడీపీవో దేవమణి చెప్పారు. ఈ కిట్లలో పిల్లలు అనారోగ్యం బారిన పడినప్పుడు, చిన్ని చిన్న గాయాలు పాలయ్యినప్పుడు ప్రథమ చికిత్స అందజేసేందుకు అవసరమైన ఆయింట్‌మెంట్లు, సిరప్‌లు, టాబ్లెట్స్, యాంటీసెప్టిక్‌క్రీమ్‌లు, శానిటైజర్లు తదితర మందులు ఉన్నట్టు చెప్పారు. ఆయా కిట్‌లను త్వరలో అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేస్తామన్నారు.

ఘనంగా సీతమ్మతల్లి ఉత్సవాలు



డ్యాన్స్ చేస్తున్న కళాకారులు

హుకుంపేట: ఓలుబెడ్డా గ్రామంలో సీతమ్మతల్లి జెండా కొండా మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేశారు. గిరిజన సంప్రదాయ నృత్యాలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, కాంతారావు, గ్రామ పెద్దలు జానకిరావు, రాంబాబు, సాధు, చిట్టిబాబు తదితరులు పర్యవేక్షించారు.

ఆశల సాగు



బర్లీ పొగాకు తోట



పొగాకు ఆకులను తోరణాలుగా కడుతున్న రైతు కుటుంబం

- వైట్ బర్లీ పొగాకు పంటపై గిరిరైతు ఆసక్తి
- ఏటా మూడు పంటలు
- కష్టానికి తగిన ఫలితం



పొగాకు తోటలో యంత్రం సహాయంతో పనులు చేస్తున్న రైతు



పక్వానికి వచ్చిన పొగాకు ఆకులను ఆరబెట్టిన దృశ్యం

రాజవొమ్మంగి: ఈ సీజన్‌లో పండించే వైట్‌బర్లీ పొగాకు సాగులో గిరిరైతు ఆసక్తి కనపరస్తున్నాడు. ఏడాదిలో ఏకంగా మూడు పంటలు పండిస్తు లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రతి పంటలో రూ.50వేల నుంచి రూ.60వేల వరకు ఆదాయం పొందుతున్నారు. దీంతో సాగుపై రైతులు మక్కువ పెంచుకొంటున్నారు. ఇదిలా ఉండగా సిగరెట్ల తయారీలో ఉపయోగించే ఈ పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

సాగుకు ప్రోత్సాహం

ప్రస్తుతం రాజవొమ్మంగి మండలంలోని రైతులు నీటి తడులు ఇస్తు ఈ పంటను పండిస్తున్నారు. మండలంలో దాదాపు 2,000 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రముఖ పొగాకు కంపెనీ ఐటీసీ (ఇండియన్ టొబాకో కంపెనీ) మన్యంలో పొగాకు సాగులో రైతులను ప్రోత్సహిస్తోంది. ఖరీఫ్ వరి కోతలు పూర్తయిన తరువాత ఖాళీ భూముల్లో బర్లీ పొగాకు సాగుపై కంపెనీ సూపర్‌వైజర్లు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకు గాను బ్యాంకెట్ ఏఒన్ రకం (బీఏ-1) విస్-5, వీబీ-22 వంటి ఆధునిక పొగాకు మొక్కలను (పొగాకు నారును) కంపెనీ సరఫరా చేస్తోంది. కొంత మేర రాజమహేంద్రవరం నర్సరీల నుంచి మరికొంత స్థానికంగా షెడ్డులో పెంచిన పొగాకు నారును రైతులకు పంపిణీ చేస్తున్నారు. షెడ్డులలో పొగాకు నారు పెంచేందుకు ఆసక్తి చూపుతున్న రైతులకు సుమారు రూ.30 వేల విలువైన సామగ్రిని ఉచితంగా అందజేస్తున్నారు. ఎకరా పొలంలో పొగాకు పండించాలంటే 10,000 మొక్కలు అవసరమవుతాయి. ఒక మొక్క 50 పైసలు పలుకుతుండగా ఎకరాకు అవసరమైన పొగాకు నారుకు రైతులు రూ.3,750 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. అలాగే రైతులకు పంట కాలంలో అవసరమైన పెట్టుబడితో పాటు వారికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని కంపెనీ సమకూర్చుతుంది. ఎరువులు, టార్పాలిన్లు, ఇతరత్రా సామగ్రిని సబ్సిడీ ధరలకు కంపెనీ అందజేస్తోంది. పొగాకు సాగులో రైతులు ఎకరాకు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు అవుతోంది. కాగా ఎకరాకు సరాసరి 8 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు. నేడు మార్కెట్ ధర క్వింటా రూ.15,500 పలుకుతుండగా ఎకరాకు దాదాపు రూ1.24 లక్షల ఆదాయం పొందుతున్నారు. ఏ ఇతర పంటల వల్ల ఇంత ఆదాయం లభించక పోవడంతో గిరిజన రైతులు అధికంగా వైట్ బర్లీ పొగాకు సాగుపైనే ఆసక్తి కనపరుస్తున్నారు.

చేతి నిండా పని

బర్లీ పొగాకు సాగులో మొక్క నాటింది మొదలు ఆకులు తురిమే వరకు ఇంటిల్లిపాదికి పని ఉంటుంది. దీంతో వేసవిలో ఉపాధి కోసం గిరిజన రైతులు ఈ పంటపై మొగ్గు చూపుతున్నారు. మొక్క నాటిన తరువాత కలుపు, మొక్కల మధ్య గొప్పు తవ్వడం, బోదెలు తీయడం వంటి పనులు చేపడతారు. ఆకులు వెడల్పుగా పెరిగి, చుక్కలు వచ్చి ఆకులు పసుపు రంగులోకి మారగానే పంట పక్వానికి వచ్చినట్టు భావిస్తారు.

పక్వానికి వచ్చిన ఆకులను తోరణాలుగా కట్టి పాకల్లో ఆరబెడతారు. ఆకులు బాగా ఎండి బంగారు వర్ణంలోకి మారగానే వాటిని 50 నుంచి 100 కిలోల బేళ్లుగా తయారుచేస్తారు. ఈ బేళ్లను కొనుగోలు కేంద్రాలకు తరలించగానే నాణ్యతను బట్టి కంపెనీ ధర ప్రకటిస్తుంది. కొనుగోళ్లు పూర్తయిన వారంలోగానే సొమ్ములు అందజేస్తారు. బర్లీ పొగాకు మార్కెట్ ఉండడంతో గిరి రైతులు సాగుపై ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ధరలు బాగున్నాయి



ఏజెన్సీ వాతావరణ పరిస్థితులకు పొగాకు సాగు అనువుగా ఉంది. కష్టపడిన దానికి ఫలితం దక్కుతోంది, దీంతో పొగాకు సాగుపై ఆసక్తి పెరిగింది. ఇంటిల్లిపాదికి పని సరిపోతోంది. వేసవిలో కూడా పొగాకు సాగుతో కొంతమేర లాభం పొందుతున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు బాగున్నాయి.

– నక్కా మునలయ్య, రైతు, రాజవొమ్మంగి

రుణాల రికవరీకి స్పెషల్ డ్రైవ్



రైతులతో మాట్లాడుతున్న డీసీసీబీ జీఎం ప్రవీణ్ కుమార్, సిబ్బంది

అడ్డతీగల: అడ్డతీగల సొసైటీ ద్వారా రైతులు తీసుకున్న రుణ బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు డీసీసీబీ జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. డీసీసీబీ అధికారులు అడ్డతీగల సొసైటీ సిబ్బందితో కలసి పలు గ్రామాల్లో బుధవారం విస్తృతంగా పర్యటించి రుణ బకాయిల వసూలు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అడ్డతీగల సొసైటీ నుంచి 95 గ్రామాల పరిధిలో ఉన్న 1,900 మంది రైతులు సుమారు రూ.9 కోట్లు రుణాలుగా తీసుకున్నారన్నారు. మార్చి 31 నాటికి రుణ బకాయిలు వసూలు చేయాల్సి ఉందన్నారు. కనీసం 50 శాతం అయినా వసూలు కావాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు కోటి రూపాయలు వసూలు చేసినట్టు తెలిపారు. రైతులు రుణ బకాయిలు చెల్లించడానికి సహకరించాలని ఆయన కోరారు. డీసీసీబీ నోడల్ అధికారి రామరాజు, సూపర్‌వైజర్ నాగేంద్రకుమార్, అడ్డతీగల సొసైటీ సీఈవో మణిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు రూరల్: సబ్ స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్‌ల మరమ్మతు పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుతున్నట్టు ఈఈ ఎ.వి.ఎ న్.ఎం.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జి.మాడుగుల సబ్ స్టేషన్ కొక్కిరాపల్లి ఫీడర్ పరిధిలోని పాలమామిడి, గెమ్మెలి, వంజరి, లువ్వాసింగి, పాడేరు సబ్‌స్టేషన్ బొక్కెళ్ల ఫీడర్ పరిధిలో బరిసింగి, ఇరడాపల్లి, కించూరు, డోకులూరు, వంజంగి గ్రామలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అయ్యన్నపాత్రుడు గిరిజనులకు క్షమాపణ చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ జేఏసీ డివిజన్ చైర్మన్ నరేష్

చింతూరు: ఆదివాసీ చట్టాలను అవహేళన చేస్తూ వ్యాఖ్యలు చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు తక్షణమే గిరిజనులకు క్షమాపణ చెప్పాలని ఆదివాసీ జేఏసీ చింతూరు డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ చెప్పారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాలోకి మళ్లించిన విషయాన్ని దాచిపెట్టి ఏజెన్సీ అభివృద్ధికి 1/70 చట్టం అడ్డుపడుతోందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తన పరిధిలో లేని అంశాన్ని అవహేళన చేసేలా మాట్లాడిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదివాసీలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు మహేష్, సీతారామయ్య, లక్ష్మణ్, జోగారావు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

పాడేరు రూరల్: అక్రమ అరెస్టలతో ఉద్యమాలను ఆపలేరని ఏఐఎస్ఎఫ్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 1న అన్నమయ్య జిల్లా సమ్మెపల్లిలో జరిగిన సీఎం చంద్రబాబు బహిరంగ సభలో విద్యారంగం సమస్యలపై కోరిన అన్నమయ్య జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్‌ను అక్రమంగా పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. అరెస్టులు చేసి భయభ్రాంతులు సృష్టించడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు, అరెస్ట్ చేసిన మాధవ్‌ను తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. నేతలు కృష్ణ, తనీష్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్పీ సతీష్‌కు అభినందనలు



సతీష్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాజవొమ్మంగి: ఇటీవల రంపచోడవరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఉత్తమ సీఆర్‌పీగా ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ చేతుల మీదుగా అవార్డు అందుకొన్న ఉపాధ్యాయుడు సతీష్‌ను సహచర సిబ్బంది బుధవారం సత్కరించారు. మండలంలోని బోర్నగూడెం స్కూల్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న సీఆర్పీ చవలం సతీష్ సేవలను ఉన్నతాధికారులు గుర్తించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సతీష్‌ను సహచర ఉపాధ్యాయులు తదితరులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు కృష్ణ, వర ప్రసాద్, శివప్రసాద్, పాండురంగస్వామి, గంగన్నదొర, సతీష్, విజయబాబు, విశ్వనాథరెడ్డి, పాపారావు, బాలరాజులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాత తీర్థం రేపు



సంతోషిమాత అమ్మవారు

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత అమ్మవారి తీర్థం ఈ నెల 7వ తేదీన ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన, సాయంత్రం నుంచి ఆలయంలో భజన కార్యక్రమం, మహిళలు కోలాటం జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి రామాలయ పునః ప్రారంభోత్సవాలు

- తిమ్మరాజుపేటలో మూడు రోజుల పూజా కార్యక్రమాలు
- 8న విగ్రహాల ప్రతిష్ట



తిమ్మరాజుపేటలోని రామాలయం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో రామాలయం పునః ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గురువారం నుంచి శనివారం వరకు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. గురువారం అఖండ దీపారాధన, గణపతి పూజ, హోమం, 7న గోపూజ, పారాయణం, విగ్రహాల ఊరేగింపు జరుగుతుందన్నారు. 8న వేద మంత్రోచ్చారణల మధ్య సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. 8న మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. భక్తులు మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

తాగునీటి సమస్యపై వినతి



ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ సరియవలస గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ స్థానికులతో కలిసి గిరిజన సంఘం నాయకులు బుధవారం ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో జల్ జీవన్ మిషన్ ద్వారా పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారన్నారు. దీంతో స్థానికులు తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కష్టాలను తీర్చాలని వినతిపత్రంలో కోరారు. సీతారాం, తిలక్, రాందాస్, జగత్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నాయకుల ప్రచారం



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి అప్పలరాజు

డుంబ్రిగుడ: మండలంలోని పీఆర్‌టీయూ నాయకులు స్థానిక ప్రభుత్వ ఉన్నత, బాలుర, గిరిజన ఆశ్రమ, కేజీబీవీ పాఠశాలల్లో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులనాయుడికి మద్దతు తెలియజేయాలని కోరారు. పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పలరాజు మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి శ్రీనివాసులనాయుడిని గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. లక్ష్మయ్య, చిన్నిబాబు, నాగేశ్వరరావు, శ్రీను, కృష్ణ, సూరిబాబు, లైకోన్ తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేపై శిక్షణ

రోలుగుంట : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్.నాగమ్మ బుధవారం భూసర్వేపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యాలయన్ని బుధవారం రాత్రి సందర్శించిన నర్సీపట్నం ఆర్డీవో భూముల సర్వేపై శిక్షణ ఇచ్చారు. మదర్ రికార్డులో భూవివరాలను పరిశీలించాలన్నారు. వన్ బి, ఎఫ్ఎంబీ, తదితర రికార్డులు పరిశీలన, విధుల నిర్వహణపై అవసరమైన శిక్షణ ఇచ్చారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవ స్థలంలో 60 అడుగుల బండి ప్రభ

రోలుగుంట : మండల కేంద్రం లో నాలుగు రోజుల పాటు నిర్వహించే శ్రీ గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు సుర్ల వర్గీయుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అటవీ ప్రాంతంలో సేకరించిన వెదురుతో సుమారు 60 అడుగులతో నిర్మించిన బండి ప్రభను నిర్వాహకుల ఇంటి వద్ద నుంచి ఉత్సవ స్థలానికి భక్తులు మోసుకొచ్చి ప్రతిష్ఠించారు. గ్రామంలో విద్యుదలంకరణ చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ మాట్లాడుతూ బుధవారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. గురువారం చిన్న తీర్థం జరుగుతుందన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ గ్రామ యువతతో పలు పగటి వేషాలు నిర్వహించి ఆ రాత్రి సాంఘిక నాటకం నిర్వహిస్తామన్నారు. శనివారం నిమజ్జనోత్సవం జరుగుతుందని తెలిపారు.

కార్మిక చట్టాలు పటిష్టంగా అమలుచేయాలి





చింతూరు, రాజవొమ్మంగి తహసీల్దార్‌లు చిరంజీవి, సత్యనారాయణకు వినతిపత్రం అందచేస్తున్న సీఐటీయూ నాయకులు

చింతూరు: కార్మికవర్గ హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం చింతూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, కనీస వేతనం రూ 26 వేలకు పెంచాలని డిమాండ్‌చేశారు. అనంతరం స్థానిక తహశీల్దార్ చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. నేతలు సుబ్బారావు, నూకరత్నం, వెంకటరమణ, కనకదుర్గ, వసంత, వీరమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: కార్మిక చట్టాలను పటిష్టంగా అమలుచేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు బుధవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ప్లకార్డులు, జెండాలు చేతపట్టుకొని ఊరేగింపుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. తహసీల్దార్ అల్లు సత్యనారాయణను వారు కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా రామరాజు మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం, అంగన్‌వాడీ, ఆశ యూనియన్ నేతలు వెంకటలక్ష్మి, శ్రీనివాస్, అమ్మిరాజు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అడ్డతీగలలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు బుధవారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. స్థానిక సీతపల్లి జంక్షన్ నుంచి దేవీసెంటర్ మీదగా మార్కెట్, తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా జరిపారు. అనంతరం తహసీల్దార్ కొమరం సూర్యారావుకు న్యాయపరమైన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. కార్మికులను స్కీం వర్కర్లుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలన్నారు.

ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం



చికిత్స పొందుతున్న ఉపేంద్ర

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలస పంచాయతీ చాపరాతిపాలెం గ్రామ సమీపంలోపి హైవేపై బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. నర్సీపట్నానికి చెందిన గొలుగొండ మండలం లింగాలమ్మదొరపాలెం గ్రామానికి చెందిన తుచ్చ ఉపేంద్ర(23) తన బైక్‌పై పెదవలస వస్తుండగా చాపరాతిపాలెం వద్ద వచ్చేసరికి వాహనం అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో రహదారి నిర్మాణానికి వేసి ఉన్న కాంక్రీట్ కుప్పలపై పడ్డాడు. దీంతో పాటు అక్కడ ఉన్న ఇనుప ఊచలు అతనికి గుచ్చుకొని రక్తస్రావమైనట్టు స్థానికులు చెప్పారు. గ్రామస్తులు స్పందించి ఉపేంద్రను పెదవలస ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యుల సిఫార్సు మేరకు అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చింతపల్లి సీహెచ్‌సీకి తరలించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

చీడికాడ : మండలంలో చీడిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానం గురించి రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రీజనల్ శిక్షణ అధికారి ప్రకాష్ హాజరయ్యారు. సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి రైతు రబీ సీజన్‌లో పప్పుధాన్యాలు, చిరు ధాన్యాలు, వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పి హేమసుందర్, దేముళ్లు, నాగమణి, నాయుడుబాబు పాల్గొన్నారు.